

## మారగాని రాంబాబు

**గా**లిలోకి రింగులు రింగులుగా సిగరెట్‌ని స్మోక్ చేస్తూ - ఆకాశంలోని పాలపుంత తీరుని జాబిల్లి గమనాన్ని ఆలకిస్తున్నాడు సిద్దార్ధ.

"మా టాపిక్‌లో పడి మరచిపోయాము అరె సిద్దూ నీవేంట్రా! పదిన్నరయింది యింకా వెళ్లాలనుకోలేదు. రోజూ తొమ్మిదికే వెళ్ళిపోయేవాడివి" అన్న మిత్రుడి మాటలకు చిర్నవ్వుతో చూస్తూ "పక్కింట్లోకి ఎవరో పొద్దున దిగార్రా" అన్నాడు.

భార్య మధుమతి పుట్టింటికెళ్తూ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయ్ "యేవండీ బయట నానా చిరుతిళ్లు తినకండి అన్నీ చేసి డబ్బాల్లో వుంచాను తినండి అలాగే భోజనమని డాబా వెంట తిరక్కండి. మా పిన్ని బాబాయ్‌లకి చెప్పాను శుభ్రంగా అక్కడెళ్లి తినండి ఆరోగ్యం జాగ్రత్త. తొందరగా ఇంటికి వచ్చేయండి నేలేనని లేట్ చేయకండి. అసలే చివరుంది ఇల్లు పైగా పక్కింట్లో ఎవరూ లేరాయే క్యాష్ కూడా వుంది." బట్టలు సర్దుతున్నప్పటి నుండి రైలెక్కి పోయేంతవరకూ పొల్లు పోకుండా పదే పదే చెప్తున్న మాటలకి నవ్వొచ్చింది తనలో తానే చిన్నగా నవ్వుకోసాగాడు.

"బాయ్ రా సిరి, నివాస్! మా ఆవిడ ఫోన్ చేస్తానంది మరిచే పోయాను" చెప్పి వెళ్లిపోయాడు సిద్దార్థ.

అంతలోనే ఫోన్ మ్రోగింది మాట్లాడాడు - ఫోన్‌లో కూడా రొటీన్ జాగ్రత్తలే!

బయట పడుకోవద్దని ఇంతకుముందే మధుమతి చెప్పినా వినకుండా లోన ఫ్యాన్ కూలర్ వున్నా మండు వేసవి పండు వెన్నెల కావటంతో ఆరు బయట లాన్‌లో పడుకున్న సిద్దార్థకి పక్కింటి నుండి ఏడ్పుతో కూడిన మాటలు విన్పించసాగాయి.

"యేవండీ! ఆపరేషన్ చేయకపోతే మనపాప బ్రతకదు కదూ"

"అనితా యేం కాదు!" అంటున్న అతని మాటలు ఎక్కడ్నించో వస్తున్నాయి.

"యేం కాదూ.... డాక్టర్ చెప్పే మాటలన్నీ నేవిన్నాను ... డబ్బు మనకెక్కడిది ఆపరేషన్ చేయలేము యిక మన అమ్మాయి మనకు దక్కదు." అంటూ ఏడుస్తున్న భార్యను ఓదార్చలేక యేమార్చలేక పోతున్నాడు. మనకిక దక్కదు అన్న పదే పదే మాటలకు - దిగమింగుకో లేక అతను అచేతనుడై ఏడ్వసాగాడు ఆమెతో బాటుగా.

"మనకున్నది అంతా అమ్మినా అంత డబ్బు రాదు అనితా!" అన్నాడు విచారంగా.

"ఇది గోండి ఈ తాళి బొట్టు చెయిన్ అమ్మితే పదివేలు వస్తాయి" అంది.

మెడలో పసుపు తాడు చూడగానే తట్టుకోలేక పోయాడతను. "ఎన్ని కష్టాలొచ్చినా వాడుకోలేదు దీన్ని ఇదొక్కటే నీకున్న...."

"అమ్మాయి ప్రాణం కంటే ఎక్కువ కాదు లెండి ఎలాగైనా ఎక్కడైనా అప్పొసొప్పొ చేసి...."

"ఎవరిస్తారే? వచ్చే జీతం చాలక సంసారం సాగడానికే గతంలో అప్పులు మిగిలాయి ఎలాగోలా! రోజులు గడిపేస్తున్నాం నీకు తెలియందేముంది. ఎవరిస్తారు అప్పు చూపిస్తామన్నా కూడా ఇవ్వనటువంటి రోజులివి" అంటున్నాడు అతను.

వారి మధ్య చివరికి ఏడ్పులే మిగిలాయి!

- ఆ మాటలన్నీ సిద్దార్థ మనసుని కలిచి వేశాయి వారెడ్చి ఎప్పుడు నిద్రపోయారో కానీ వారిని వారి బాధల్ని తల్చుకుంటూ చాలా సేపటికి నిద్రపట్టలేదు సిద్దార్థకి.

+ + +

కాలింగ్ మ్రోగింది. తలుపు తీసిన అతనికి ఎదురుగా అపరిచిత వ్యక్తి నిల్చుని వుండటంతో లోనికి దారినిస్తూ 'ఎవరని?' ప్రశ్నార్థకంగా చూశాడు.

"హలో... ఐయామ్ సిద్దూ.... సిద్దార్థ యాదవ్! పక్కింట్లోనే వుంటున్నాను. రాత్రి మీ పాప ఆపరేషన్‌కని మీరు పడ్తున్న ఆవేదనంతా విన్నాను. యేమనుకోక పోతే మీ అమ్మాయి కోసం నాకు చేతనైన సాయం చేద్దామని వచ్చాను ఇదిగోండి" అంటూ అతని చేతుల్లో ఏడు వేలుంచాడు సిద్దార్థ.

వెనుకనే 'ఎవరంటూ' వచ్చిన అనితకి అతనికి సిద్దార్థ రాకకి సంభాషణకి ఆశ్చర్యం వేసింది. క్షణం పాటు తేరుకోలేక పోయారు. అర్థమయింది వారికి అతని సహృదయానికి 'హ్యాట్సాఫ్' అనుకున్నారు మనసులో.

"సార్ నా పేరు కళ్యాణ్! మిమ్మల్ని మీ మంచి తనాన్ని చూస్తుంటే చాలా సంతోషమేస్తోంది. కానీ రాత్రి మీరు విన్నది నిజం కాదు మేం వేయబోయే నాటకం తాలూకు రిహార్సల్" అని చెప్పటంతో యిక ఆశ్చర్యపోవటం తనవంతయింది.

అంతలోనే "సిదార్థగారూ మొన్నా మధ్య పేపర్లో చూసి వుంటారు 'ఓ బాలుడు తన గుండె ఆపరేషన్ నిమిత్తం న్యాయం కోరుతూ ప్రకటనిచ్చారు డబ్బులేక' ఆ బాలుని ఆపరేషన్ నిమిత్తమే మేము మా ఫ్రెండ్స్ నాటకం వేసి ఆ వచ్చినది ఆ అబ్బాయికి పంపాలని మా ప్రయత్నమే ఇది" అన్నారు.

"ప్రకటన చూల్లేదు. అయితే ఈ డబ్బు అతనికి పంపించండి. యింకా నా కొలీగ్స్, మిత్రుల ద్వారా మరి కొంత సహాయం అందించడానికి ప్రయత్నిస్తానంటూ" వెళ్లిపోతున్న సిద్దార్థ 'ఓ సహాయార్థం ఇది చేస్తున్నాం అని చెప్పినా ఓ పట్టానా మనస్ఫూర్తిగా ఇవ్వని హ్యూమనో ఫేస్‌లేని ఈ సమాజంలో' అడగకనే సాయం చేసే గొప్ప వ్యక్తిత్వం, మంచి మనసు కలవాడిగ కన్పించాడు. అనితా కల్యాణ్‌లకి.

❋

